సాక్షి ఖమ్మం

బుధవారం । 4 । జూన్ । 2025



సర్వేకే పరిమితం

కారేపల్లి మీదుగా రైల్వే డబ్లింగ్ లైన్ నిర్మాణానికి సర్వే చేసినా పరిహారంపై స్పష్టత లేక నిర్వాసితుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. 8లో



'గుట్ట'కాయ స్వాహా

కామేపల్లి మండలంలోని ప్రభుత్వ భూములు, గుట్టలపై అక్రమంగా తవ్వకాలతో మొరం తరలిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. 8లో

వాతావరణం

గరిష్ఠం / కనిష్ఠం 38° / 27°

జిల్లాలో బుధవారం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. మధ్యాహ్నం ఎండ పెరిగినా సాయంత్రానికి చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

108, 102 వాహనాల్లో అధునాతన పరికరాలు



ఉద్యోగులకు అవగాహన కల్పిస్తున్న శివకుమార్

మధిర: అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు సేవ లందించే 108, 102 అంబులెన్స్ వాహనాల్లో అధునాతన పరికరాలు అందుబాటులోకి వచ్చాయని ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ శివకుమార్ తెలిపారు. ఈమేరకు పరికరాల పనితీరు, వినియోగంపై మధిరలోని ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం ఆయన ఉద్యోగులకు అవగాహన కల్పించారు. అంబులెన్స్‌ల్లో మానిటర్, వెంటిలేటర్, సిరంజ్ పంపు, ఇంక్యుబేటర్ వినియోగం, ప్రసవానంతరం నవజాత శిశువుల్లో ఏర్పడే అనారోగ్య సమస్యల నివారణకు నవజాత శిశు సంరక్షణ అంబులెన్స్ ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మేనేజర్ దుర్గాప్రసాద్, డాక్టర్ అనిల్‌కుమార్, ఆస్పత్రి ఉద్యోగులు శ్రీనివాస్, మధు, శ్రీను, సీ.వీదేవి, విజయశ్రీ, శారద పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాలకు తేదీలు ఖరారు

ఖమ్మం స్పోర్ట్స్: రాష్ట్రంలోని హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాలకు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ తేదీలు ప్రకటించింది. మూడంచెల్లో ఎంపిక పోటీలు నిర్వహించనుండగా, తొలుత మండల స్థాయి పోటీలు ఈనెల 6నుంచి 25వ తేదీ వరకు నిర్వహిస్తారు. జిల్లాస్థాయిలో ఈనెల 27నుంచి 30వ తేదీ వరకు పోటీలు నిర్వహిస్తామని డీవైఎస్ఓ టి.సునీల్‌రెడ్డి తెలిపారు. అలాగే, రాష్ట్రస్థాయిలో జూలై 7నుంచి 12వ తేదీ వరకు జరుగుతాయని వెల్ల డించారు. నాలుగో తరగతిలో ప్రవేశాలు కల్పించనుండగా, ఒక్కో స్పోర్ట్స్ స్కూల్‌లో బాలురకు 20, బాలికలకు 20 సీట్లు ఉంటాయని, 8 – 9 ఏళ్ల పిల్లలు అర్హులని తెలిపారు. ఈమేరకు వివిధ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించి అర్హత సాధించిన వారికి మెడికల్ టెస్ట్ అనంతరం ప్రవేశాలు కల్పిస్తారని డీవైఎస్ఓ వివరించారు.

మత సామరస్యాన్ని చాటుదాం..



మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ ప్రసాద్‌రావు

ఖమ్మంక్రైం: బక్రీద్ పండుగ పర్వదినాన్ని ప్రశాంత వాతావరణంలో జరుపుకోవడమే కాక మత సామరస్యాన్ని చాటేలా అన్ని మతాల వారు సహకరించాలని అడిషనల్ డీసీపీ ప్రసాద్‌రావు సూచించారు. ఖమ్మంలో మంగళవారం జరిగిన పీస్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. చట్టాన్ని గౌరవిస్తూ, సంప్రదాయాలను పాటించడంలో ముందు నిలిచే జిల్లా ప్రజలు ఇప్పుడు కూడా అదే తరహాలో వ్యవహరించాలని కోరారు. బక్రీద్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కాగా, పాడి ఆవులు, లేగ దూడల క్రయవిక్రయాలు జరపొద్దని సూచించారు. మత సామరస్యానికి భంగం కలిగించేలా ఎవరైనా ప్రసంగాలు చేసినా, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా చర్యలు తీసుకుంటామని అదనపు డీసీపీ తెలిపారు. అనంతరం వివిధ మతాల పెద్దలు తమ అభిప్రాయాలు వెల్లడించారు. ఏసీపీ రమణమూర్తి, సీఐలు కరుణకర్, బాలకృష్ణ, మోహన్ బాబు, భానుప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు చేరిన యూనిఫామ్ క్లాత్



క్లాత్ అందిస్తున్న ఎంఈఓ శైలజాలక్ష్మి

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేసే యూనిఫామ్ క్లాత్ జిల్లాకు చేరింది. మొదటి దశలో వచ్చిన క్లాత్‌తో యూనిఫామ్ సిద్ధం చేస్తున్నారు. రెండో విడతగా వచ్చిన క్లాత్‌ను బాధ్యులకు మంగళవారం అందజేసినట్లు ఖమ్మం అర్బన్ ఎంఈఓ శైలజాలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

సమస్య చెప్పండి.. పరిష్కరిస్తాం..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం పూర్తిస్థాయి అమల్లో భాగంగా అన్ని మండలాల్లో రెవెన్యూ సదస్సులు మంగళవారం మొదలయ్యాయి. ఈ చట్టాన్ని ఏప్రిల్ 14న ప్రారంభించగా.. పైలట్ ప్రాజెక్టుగా రాష్ట్రంలోని నాలుగు మండలాలను ఎంపిక చేశారు. ఇందులో జిల్లాలోని నేలకొండపల్లి ఉండగా, రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు నిర్వహించి భూసమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. రెండో విడతగా బోనకల్ మండలంలోనూ సదస్సుల నిర్వహణ పూర్తయింది. మిగిలిన మండలాల్లోని రెవెన్యూ గ్రామాల వారీగా మంగళవారం మొదలైన సదస్సులు ఈనెల 20వ తేదీ వరకు కొనసాగనున్నాయి.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం



కొణిజర్ల మండలం తనికెళ్లలో దరఖాస్తులు ఇస్తున్న రైతులు

'భూభారతి'లో భాగంగా సదస్సులకు శ్రీకారం

- ఇప్పటికే నేలకొండపల్లి, బోనకల్ మండలాల్లో నిర్వహణ
- కొనసాగుతున్న అక్కడి దరఖాస్తుల పరిష్కారం
- మిగతా మండలాల్లో తొలిరోజు 3,153 దరఖాస్తుల స్వీకరణ

పైలట్‌గా రెండు మండలాలు...

భూభారతి చట్టాన్ని ప్రారంభించినప్పుడు రాష్ట్రంలో ఎంపిక చేసిన నాలుగు మండలాల్లో జిల్లాలోని నేలకొండపల్లికి స్థానం దక్కింది. ఈ మండలంలోని రెవెన్యూ గ్రామాల్లో నిర్వహించిన సదస్సుల్లో 3,224 మంది రైతులు సమస్యలపై దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 1,791 దరఖాస్తులు సాదాబైనామాపై ఉండగా, ఇతర సమస్యలపై 1,433 దరఖాస్తులు ఉన్నాయి. ఇందులో 322 దరఖాస్తులు పరిష్కరించి, 953 తిరస్కరించారు. ఇక అసైన్డ్ భూములకు సంబంధించి 70 దరఖాస్తులకు ఆమోదం లభించింది. మిగిలిన దరఖాస్తుల పరిశీలన కూడా కొనసాగుతోంది. రెండో విడతలో రాష్ట్రవ్యాప్తంగా 28 మండలాలను ఎంపిక చేయగా.. జిల్లాలోని బోనకల్ మండలాన్ని చేర్చారు. ఈ మండలంలో 2,861 దరఖాస్తులు అందగా, 43 పరిష్కరించి మిగతా వాటి పరిశీలనపై దృష్టి సారించారు.

జిల్లావ్యాప్తంగా సదస్సులు

పైలట్ ప్రాజెక్టులుగా ఎంపికైన నేలకొండపల్లి, బోనకల్ మండలాలు మినహా జిల్లాలోని మిగిలిన అన్ని మండలాల్లోనూ మంగళవారం భూభారతి చట్టం అమలుపై సదస్సులు మొదలయ్యాయి. రెవెన్యూ గ్రామాల వారీగా నిర్వహించే ఈ సదస్సుల్లో తహసీల్దార్ సహా ఉద్యోగులు పాల్గొని రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈనెల 20వ తేదీ వరకు సదస్సుల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. త్వరలోనే సర్వేయర్ల నియామకం జరగనుండడంతో దరఖాస్తుల ఆధారంగా సర్వే చేసి సమస్యలు పరిష్కరించనున్నారు. తద్వారా గ్రామాల్లో భూసంబంధిత సమస్యలు ఉండవని చెబుతున్నారు.

తొలిరోజు 3,153 దరఖాస్తులు

జిల్లాలో 19 మండలాల పరిధి 37 రెవెన్యూ గ్రామాల్లో తొలిరోజైన మంగళవారం భూభారతి సదస్సులు నిర్వహించినట్లు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. ఈమేరకు ఆయా గ్రామాల్లో కలిపి భూసమస్యలపై 3,153 దరఖాస్తులు అందాయని వెల్లడించారు. తహసీల్దార్ ఆధ్వర్యాన రెవెన్యూ ఉద్యోగులు సదస్సుల్లో పాల్గొని చట్టంపై అవగాహన కల్పించడమే కాక సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారని తెలిపారు. అయితే, రైతులు దరఖాస్తులతో పాటు వారి వద్ద ఉన్న ఆధారిత డాక్యుమెంట్లు సమర్పించాలని కలెక్టర్ సూచించారు.

పొరపాట్లకు తావులేకుండా..

రైతులు తమ సమస్యలపై ఇచ్చిన దరఖాస్తులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. సమస్యకు కారణాలను ఆరా తీస్తూనే సర్వేనంబర్ల వారీగా, రైతుల వద్ద ఉన్న ఆధారాలను పరిశీలించి పరిష్కారంపై దృష్టి సారించారు. మరోమారు అదే సమస్యపై దరఖాస్తు అందకుండా, పొరపాట్లకు తావులేకుండా పరిష్కరించేలా ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారు. అయితే పైలట్ మండలాల్లో ఎక్కువగా సాదాబైనామా దరఖాస్తులే వచ్చాయి. కానీ ఈ అంశం కోర్టు పరిధిలో ఉండడంతో వీటిని పక్కన పెట్టిన అధికారులు మిగతా దరఖాస్తులను త్వరగా పరిష్కరించేలా పరిశీలనలో నిమగ్నమయ్యారు.

భూముల రీసర్వేతో రైతులకు మేలు

- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- ములుగుమాడులో సదస్సు, సర్వేను ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి
- పాల్గొన్న మంత్రులు పొంగులేటి, తుమ్మల



డీజీపీఎస్ ద్వారా సర్వే తీరును పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు

ఎర్రుపాలెం: రాష్ట్రప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన భూభారతి చట్టం ద్వారా భూముల రీసర్వే చేపట్టనుండగా రైతులకు మేలు జరగడమే కాక భూసమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఎర్రుపాలెం మండలం ములుగుమాడు గ్రామంలో భూముల రీ సర్వే, భూభారతి సదస్సును మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులతో కలిసి ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు మాట్లాడారు.

ఎవరిపై భారం పడకుండా సర్వే

రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించడమే కాక ఎవరికీ రూపాయి కూడా ఖర్చు లేకుండా భూముల రీసర్వే చేసి రికార్డులకు భద్రత కల్పిస్తామని భట్టి, మంత్రులు వెల్లడించారు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీ మేరకు ధరణి చట్టం స్థానంలో భూభారతి తీసుకొచ్చామని తెలిపారు. తద్వారా ప్రతీ భూకమతానికి ఆధార్ కార్డు మాదిరి భూధార్ ఇస్తామని చెప్పారు. అంతేకాక ఏటా సదస్సులు నిర్వహించి అమ్మకాల, కొనుగోలు వివరాలను అప్‌డేట్ చేస్తామని తెలిపారు. భూ సంస్కరణల కారణంగా రాష్ట్రంలో దాదాపు 26లక్షల ఎకరాల అసైన్డ్ భూములను పేదలకు పంపిణీ చేస్తే, గత పదేళ్లలో ఎక్కడా కమిటీలు కానరాలేదని పేర్కొన్నారు. ఈనేపథ్యాన కొత్త చట్టంతో కమిటీలు ఏర్పాటు చేసి మిగులు భూములను ఇంటి పట్టాలుగా, సాగుకు పంపిణీ చేస్తామని వారు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఉన్న భూమి కంటే ఎక్కువగా రికార్డుల్లో నమోదు చేయించి రైతుబంధు నిధులు కాజేశారని, ఇలాంటివన్ని ఇక సాగవని స్పష్టం చేశారు. అంతేకాక గ్రామ పాలనాధికారులు, లైసెన్సు సర్వేయర్ల నియామకంతో రైతుల సమస్యలు ఎక్కడికక్కడే పరిష్కారమవుతాయని తెలిపారు.



అభివాదం చేస్తున్న మంత్రులు, ఉన్నతాధికారులు

త్వరలోనే రైతు భరోసా

ఈసంవత్సరం వరి నాట్ల కంటే ముందే రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేస్తామని భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. కాగా, నక్షాలు లేకుండా రాష్ట్రంలోని 413 గ్రామాల్లో రైతులు, ప్రజలు ఇబ్బంది పడుతుండగా తాజాగా చేపడుతున్న రీ సర్వేతో ఈ సమస్య పరిష్కారమవుతాయని వెల్లడించారు. కాగా, ధరణి చట్టంలోని లోపాలతో ఎదురైన ఇబ్బందులు పలువురు రైతులు వివరించారు. అనంతరం భూముల రీసర్వేతో లాభాలను సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్, సర్వే సెటిల్‌మెంట్ ల్యాండ్ రికార్డ్స్ కమిషనర్ జ్యోతి బుద్ధప్రకాష్, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో లాండ్ అండ్ సర్వే జేడీ ప్రసన్నలక్ష్మి, పోలీసు కమిషనర్ సునీల్‌దత్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, ఆర్డీఓ నర్సింహారావు, తహసీల్దార్ ఎం.ఉషాశారద, మార్కెట్ చైర్మన్ బండారు నర్సింహారావు, డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, కాంగ్రెస్ జిల్లా, మండల అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డితో పాటు చావా రామకృష్ణ, గంటా తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

నష్ట నివారణే కీలకం



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పక్కన సీపీ సునీల్‌దత్, అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాసరెడ్డి తదితరులు

- విపత్తు సమయాన హెచ్చరికలు క్షేత్రస్థాయికి చేరాలి
- డీడీఎంపీ సమావేశంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం సహకారనగర్: విపత్తు సమయంలో నష్టాన్ని గణనీయంగా తగ్గించడమే లక్ష్యంగా ప్రణాళిక ఉండాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. జిల్లా డిజాస్టర్ మేనేజ్మెంట్ ప్లాన్(డీడీఎంపీ) సమావేశం కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించగా పోలీస్ కమిషనర్ సునీల్‌దత్, అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డి, ఎన్‌డీఆర్‌ఎఫ్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత ఏడాది వరదలతో నష్టం జరిగిన ప్రాంతాలను పరిగణనలోకి తీసుకుని ప్రస్తుత పరిస్థితులపై అధ్యయనం చేయాలన్నారు. ఈనెల 15 నుంచి మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లో కురిసే వర్షం ఆధారంగా నదీ ప్రవాహాల వివరాలను వాట్సప్ గ్రూపుల ద్వారా సేకరిస్తూ హెచ్చరికలను ప్రభావిత ప్రాంతాలకు చేరవేయాలని సూచించారు. అంతేకాక ముంపు ప్రాంతాల ప్రజల కోసం ముందస్తుగా పునరావాస కేంద్రాలను గుర్తించాలని కలెక్టర్ తెలిపారు. అలాగే, కూలడానికి సిద్ధంగా ఉన్న ఇళ్లు, ఇళ్లలో ఒంటరిగా ఉండే మహిళలు, వృద్ధులను గుర్తించి అప్రమత్తం చేయాలన్నారు. సీపీ సునీల్‌దత్ మాట్లాడుతూ వరదల సమయాన ప్రజలకు రక్షణ కల్పించడంలో తమ శాఖ పూర్తిగా అందుబాటులో ఉంటుందని తెలిపారు. అనంతరం కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డి మాట్లాడగా జిల్లా రెవెన్యూ అధికారి ఏ.పద్మశ్రీ, జెడ్పీ సీఈఓ దీక్షారైనా, డీఆర్‌డీఓ సన్యాసయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో పరిశుభ్రతపై శిక్షణ

నేలకొండపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం సిద్ధం చేసే చోటే కాకుండా ఆవరణలో అపరిశుభ్రతతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రభుత్వం గుర్తించింది. ఈమేరకు ఆవరణ, బాత్‌రూమ్‌ల్లో శుభ్రత పాటించేలా సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. ప్రతీ జిల్లా నుంచి కేజీబీవీ, బాలికల వసతిగృహంతో పాటు మరో రెండు పాఠశాలల నుంచి ఇద్దరు స్వీపర్లు, ఒక్కో ఏఎస్ఎంకు శిక్షణ ఇస్తారు. హైదరాబాద్‌లో ఈనెల 4వ తేదీన శిక్షణ ఇవ్వనుండగా, 5వ తేదీన ప్రభుత్వ, స్థానిక సంస్థలు, మోడల్ స్కూళ్ల నుంచి ఇద్దరేసి పారిశుద్ధ్య కార్మికులతో పాటు ఒక్కో టీచర్ శిక్షణకు హాజరు కావాల్సి ఉంటుంది. ఆపై 6, 9, 11వ తేదీల్లో వీరు జిల్లాలోని పాఠశాలల వారీగా సిబ్బందికి తాము నేర్చుకున్న అంశాలపై అవగాహన కల్పించేలా అధికారులు షెడ్యూల్ ఖరారు చేశారు.

14 మంది మైనింగ్ అధికారుల బదిలీ

సింగరేణి(కొత్తగూడెం) : సింగరేణిలో వివిధ ఏరియాల్లో పనిచేస్తున్న 14 మంది మైనింగ్ (సేఫ్టీ) అధికారులను బదిలీ చేస్తూ యాజమాన్యం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. వీరిలో ఐదుగురు డిప్యూటీ జీఎంలు, ఒక కాలరీ మేనేజర్, ముగ్గురు అడిషినల్ మేనేజర్లు, ఇద్దరు ఎస్ఈలు, ఇద్దరు సీనియర్ అండర్ మేనేజర్ స్థాయి అధికారులు ఉన్నారు. కాగా, వీరంతా ఈనెల 14వ తేదీన కేటాయించిన ఏరియాల్లో జాయినింగ్ రిపోర్ట్ ఇవ్వాలని ఉన్నతాధికారులు సూచించారు.

'బడి బాట'కు వేళాయె...

- ఈనెల 6నుంచి నిర్వహణకు సన్నాహాలు
- ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచేలా చర్యలు

ఖమ్మంసహకారనగర్: ప్రభుత్వ పాఠశాలల్లో ఈ విద్యాసంవత్సరం విద్యార్థుల సంఖ్య పెంచడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల నిర్వహించిన సమావేశంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఏటా విద్యార్థుల తగ్గుముఖం పడుతోందని గణాంకాలతో సహా వివరించారు. అంతేకాక ఈ సారి ప్రవేశాలు పెరిగేలా కృషి చేయాలని సూచించడంతో అధికారులు ఈనెల 6వ తేదీ నుంచి 'బడి బాట' నిర్వహణకు సిద్ధమవుతున్నారు.

గత ఏడాది తగ్గారు...

జిల్లాలోని 1,214 పాఠశాలల్లో 69వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. అయితే, అంతకు ముందు సంవత్సరం కంటే గత ఏడాది సుమారు 6వేల మేర తగ్గినట్లు తెలుస్తోంది. దీంతో పలు పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు వేసవి సెలవులు మొదలైనప్పటి నుంచే ప్రచారంలో నిమగ్నమయ్యారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్య, పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్ పంపిణీ, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా వస్తున్న ఫలితాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు.

ఈసారి పకడ్బందీగా..

గతంలో ప్రతీ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి పది రోజుల పాటు బడిబాట నిర్వహించినా ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేదు. గత ఏడాది ఆగస్టు 31 వరకు బడిబాట నిర్వహించగా, 12వేల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరినట్లు చెబుతున్నారు. అయితే, ఇంత తక్కువ సంఖ్యలో ప్రవేశాలు జరగడంపై సమీక్షించిన విద్యాశాఖ అధికారులు ఈసారి మరింత పకడ్బందీగా బడిబాట నిర్వహించేలా సన్నద్ధమయ్యారు. కొన్ని పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు తమ పాఠశాలల్లో ఉన్న సౌకర్యాలు, డిజిటల్ బోధన, ఇతర అంశాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తుండడం.. ఈసారి బడిబాట ముందుగా నిర్వహిస్తుండడంతో మంచి ఫలితాలు వస్తాయని భావిస్తున్నారు.

షెడ్యూల్ ఇలా..

బడిబాట కార్యక్రమంలో భాగంగా ఈనెల 6వ తేదీన గ్రామసభలు నిర్వహిస్తారు. ఇక 7వ తేదీన ఇంటింటికీ వెళ్లి బడిఈడు పిల్లలను గుర్తించడం, 8 నుంచి 10వ తేదీ వరకు కరపత్రాలతో ప్రచారం చేస్తారు. డ్రాపౌట్ పిల్లలను బడిలో, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను భవిత కేంద్రంలో చేర్పిస్తారు. ఆయా కార్యక్రమాలపై 11వ తేదీ సమీక్షించుకుని, 12న అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యాన పాఠశాలలను ప్రారంభిస్తారు. తొలిరోజునే రాత, పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్ అందించడమే కాక 13వ తేదీన సామూహిక అక్షరాభ్యాసం, బాలల సభ నిర్వహిస్తారు. ఇక 16వ తేదీన ఫౌండేషనల్ లిటరసీ, న్యూమరసీ(ఎఫ్ఎల్ఎన్), లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ (ఎల్ఐపీ) దినోత్సవం, 17న విలీన విద్య, బాలికా విద్య దినోత్సవం, 18న తరగతి పాఠశాలల డిజిటలీకరణపై అవగాహన, మొక్కల పెంపకం ప్రాధాన్యత విద్యార్థులకు తెలియజేస్తారు. చివరగా 19వ తేదీన బడిబాట ముగింపు సందర్భంగా విద్యార్థులకు క్రీడాపోటీలను నిర్వహిస్తారు.

విస్తృతంగా అవగాహన



ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈనెల 6నుంచి బడిబాట నిర్వహించేలా సన్నద్ధమవుతున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్య, ఇతర సౌకర్యాలు, పదో తరగతి ఫలితాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తాం. గతంలో కంటే ఈ ఏడాది విద్యార్థుల ప్రవేశాలు పెరగడమే లక్ష్యంగా కృషి చేస్తాం.

– సామినేని సత్యనారాయణ, డీఈఈ

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తత

ఖమ్మంవైద్యవిభాగం: వానాకాలం వచ్చేసినందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని శాఖల ఆధ్వర్యాన కార్యాచరణ రూపొందించడమే కాక ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ సూచించారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో మంగళవారం సమావేశమైన ఆమె మాట్లాడారు. వానాకాలంలో మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికున్‌గున్యా, మొదడువాపు వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. అలాగే, 30 వేల డెంగీ కిట్లను పీహెచ్‌సీలకు సరఫరా చేస్తామని వెల్లడించారు. పాఠశాలలు, వసతిగృహాలను తరచుగా సందర్శిస్తూ దోమలు, లార్వాలు పెరిగే కాల్వల్లో ఆయిల్ బాల్స్ వేయాలని సూచించారు. అనంతరం తిరుమలాయపాలెం, ముస్తఫానగర్ మెడికల్ ఆఫీసర్ల యాక్షన్ ప్లాన్‌పై ఆరా తీశాక మిగతా వారికి ఆమె సూచనలు చేశారు. డీఎంహెచ్ఓ బి.కళావతిబాయి, డీపీఓ ఆశాలత, జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి రాజశేఖర్, పెద్దాస్పత్రి సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్, టీబీ నియంత్రణ అధికారి వరికూటి సుబ్బారావుతో పాటు డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ రామారావు, డాక్టర్ బి.సైదులు, డాక్టర్ సీతారాం, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం

భద్రాచలం: భద్రాచలంలో శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని ఆంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

ఫిట్‌నెస్ ఉందా.. లేదా?



ఖమ్మంలో బస్సులను తనిఖీ చేస్తున్న ఏఎంవీఐ స్వర్ణలత

ఖమ్మంక్రైం: విద్యాసంవత్సరం ఈనెల 12న మొదలుకానుంది. దీంతో ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు తమ సంస్థల బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకునేందుకు ముందుకొస్తున్నారు. సర్టిఫికెట్ లేకుండా బస్సు నడిపితే సీజ్ చేస్తామని రవాణా శాఖాధికారులు హెచ్చరించడంతో రోజుకు కొందరు చొప్పున బస్సులను ఆర్‌టీఏ కార్యాలయాలకు తీసుకొస్తున్నారు. జిలాలో 1,100 బస్సులు ఉండగా, ఇప్పటివరకు 800కు బస్సులను అధికారులు పరీక్షించారు. ఖమ్మం కార్యాలయ పరిధిలో 542 బస్సులకు 240 బస్సులను తనిఖీ చేశామని జిల్లా రవాణా శాఖాధికారి వెంకటరమణ తెలిపారు. నిర్ణీత గడువులోగా బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకోకపోతే స్పెషల్ డ్రైవ్ ద్వారా తనిఖీలు చేపడుతామని ఆయన వెల్లడించారు.

క్లుప్తంగా

జేఎన్‌టీయూ నుంచి డాక్టరేట్


డాక్టరేట్ అందుకుంటున్న రామకృష్ణ

కల్లూరు: కల్లూరు మున్సిపాలిటీ పరిధి కిష్టయ్య బంజర్‌కు కావేటి రామకృష్ణకు హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఇటీవల యూనివర్సిటీలో జరిగిన సమావేశంలో ఆయన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, వీసీ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు. ఈమేరకు రామకృష్ణ, ఆయన తల్లిదండ్రులు గోపాలరావు – జయమ్మను కాంగ్రెస్ నాయకులు పెద్దబోయిన దుర్గాప్రసాద్, బైరెడ్డి మనోహర్‌రెడ్డి, మాదిరాజు లక్ష్మణరావు, జొన్నలగడ్డ గోపాలస్వామి, గునుకుల ఈశ్వరరావు, జిల్లెళ్ల కృష్ణారెడ్డి, చుక్కా, శ్రీనివాసరెడ్డి, తోట జనార్దన్, మేకల ప్రసాద్, ఎస్.కే.ఆఫ్రోజ్, షేక్ సమీర్, సయ్యద్ జావీద్ అభినందించారు.

ఖమ్మం వాసి కోటేశ్వరరావుకు..


డాక్టరేట్ అందుకుంటున్న కోటేశ్వరరావు

ఖమ్మం సహకారనగర్: హైదరాబాద్ జేఎన్‌టీయూ నుంచి ఖమ్మం చెరువుబజార్‌కు చెందిన బోనగిరి కోటేశ్వరరావుకు డాక్టరేట్ లభించింది. ప్రొఫెసర్ కె.గిరిబాబు, ప్రొఫెసర్లు పి.చంద్రశేఖర్‌రెడ్డి పర్యవేక్షణలో ఆయన సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి డాక్టరేట్ ప్రకటించారు. ఇటీవల యూనివర్సిటీ వీసీ కిషన్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా ఆయన డాక్టరేట్ స్వీకరించారు.

యూపీహెచ్‌సీలో డీఎంహెచ్‌ఓ తనిఖీ


సమావేశంలో మాట్లాడుతున్న కళావతిబాయి

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం శ్రీనివాస్‌నగర్‌లోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను డీఎంహెచ్‌ఓ బి.కళావతిబాయి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చికిత్స కోసం వచ్చిన వారితో మాట్లాడి వైద్యసేవలపై ఆరా తీశారు. అనంతరం ఉద్యోగుల హాజరు పట్టికను తనిఖీ చేశాక వారితో సమావేశమయ్యారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున అప్రమత్తంగా ఉండేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే, దోమల లార్వా నివారణ, ఫాగింగ్‌కు చర్యలు తీసుకోవాలని, జ్వరం వచ్చిన వారికి పరీక్షలు నిర్వహించి చికిత్స చేయాలని తెలిపారు. కాగా, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌ఓ స్పష్టం చేశారు. ప్రోగ్రామ్ ఆఫీసర్ రామారావు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రేష్ఠ, యూపీహెచ్‌సీ కోఆర్డినేటర్ బాబు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పశువులు అక్రమ రవాణా చేస్తే చర్యలు


వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

ముదిగొండ: అక్రమంగా పశువుల రవాణా చేపట్టే వారిపై చర్యలు తప్పవని ముదిగొండ సీఐ ఓ.మురళి హెచ్చరించారు. మండలంలోని వల్లభి సమీపాన ఏర్పాటుచేసిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులో ఆయన వాహనాల తనిఖీలను పరిశీలించారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయడడే కాక పశువుల రవాణాలో నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. తనిఖీల్లో ఎస్‌ఐ అనంతరాములు, ఏఎస్‌ఐ సాంబశివరావు, ట్రెయినీ ఎస్‌ఐ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

న్యూవిజన్ విద్యార్థిని అభినందించిన చైర్మన్


ప్రణవ్‌ను అభినందిస్తున్న చైర్మన్ ప్రసాద్

ఖమ్మం సహకారనగర్: తాజాగా విడుదలైన జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఫలితాల్లో ఆలిండియా స్థాయి 497వ ర్యాంక్ సాధించిన న్యూవిజన్ విద్యా సంస్థల విద్యార్థి పేరాల ప్రణవ్‌ను చైర్మన్ సీహెచ్‌జీకే.ప్రసాద్ మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా ప్రణవ్ మాట్లాడుతూ ఆలిండియా స్థాయి ఓపెన్ కేటగిరీలో 497వ ర్యాంక్ సాధించటం ఆనందంగా ఉందని తెలిపారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడైన తన తండ్రి సురేష్ ప్రోత్సాహకానికి తోడు కళాశాల యజమాన్యం ఇచ్చిన శిక్షణతో ఇది సాధ్యమైందని పేర్కొన్నారు. భవిష్యత్‌లో ఇంజనీర్‌గా స్థిరపడాలన్నది తన లక్ష్యమని తెలిపారు.

సర్వేకే పరిమితమైన డబ్లింగ్ లైన్

ఇళ్లు, వ్యవసాయ భూములు కోల్పోనున్న పలువురు

- ఐదు నెలల క్రితమే సర్వే, ఆపై మార్కింగ్
- ఇప్పటికీ పరిహారం ఊసెత్తని అధికారులు


రైల్వేలైన్ వెంట సర్వే చేస్తున్న ఉద్యోగులు (ఫైల్) (ఇన్ సెట్) కారేపల్లి స్టేషన్ వద్ద మ్యాప్‌ను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

కారేపల్లి: డోర్నకల్ రైల్వే జంక్షన్ నుంచి కారేపల్లి రైల్వే జంక్షన్ మీదుగా కొత్తగూడెం స్టేషన్ వరకు ఉన్న సింగిల్ ట్రాక్‌ను డబుల్ ట్రాక్‌గా నిర్మించేందుకు రైల్వే అధికారులు నిర్ణయించారు. ఈమేరకు కారేపల్లి మండలంలో కమలాపురం, గేటుకారేపల్లి, కారేపల్లి, గాంధీనగర్, చీమలపాడు, రేలకాయపల్లి గ్రామాల్లో భూసేకరణ కోసం సర్వే చేశారు. మండల వ్యాప్తంగా 54 ఎకరాలు అవసరమని గుర్తించగా, కారేపల్లి పరిధి సింగరేణి రెవెన్యూలో సుమారు 60 – 70 మంది నుంచి 11.35 ఎకరాల వ్యవసాయ భూమి సేకరించాలని ఉంటుందని నిర్ధారించారు. అలాగే, కారేపల్లిలో స్టేషన్ విస్తరణ, రెండో ప్లాట్ ఫామ్, అదనంగా రెండు ట్రాక్‌ల నిర్మాణానికి 20 కుటుంబాల నుంచి ఇళ్లు సేకరించాల్సి ఉంటుంది. ట్రాక్ నుంచి 45 మీటర్ల మేర వ్యవసాయ భూమి, స్టేషన్ పరిధిలో 65మీటర్ల భూమితో పాటు ఇళ్లు సేకరించేలా మార్కింగ్ సైతం వేశారు. ఈ ఏడాది జనవరిలో నోటిఫికేషన్ విడుదల చేసిన రైల్వే అధికారులు స్థానిక రెవెన్యూ అధికారులతో పాటు భూనిర్వాసితులకు సమాచారం ఇచ్చారు. ఆపై గ్రామసభలు నిర్వహించినా, ఇప్పటివరకు పరిహారంపై ప్రకటన చేయకపోవడంతో నిర్వాసితుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

సాగు చేయాలా.. వద్దా ?

డబ్లింగ్ లైన్ నిర్మాణ భూసేకరణ కోసం సర్వే చేపట్టి ఐదు నెలలు కావొస్తుండగా, పరిహారంపై స్పష్టత కోసం నిర్వాసితులు ఎదురుచూస్తున్నారు. వ్యవసాయ సీజన్ మొదలుకావడంతో రైల్వే అధికారులు మార్కింగ్ చేసిన భూముల్లో పంట సాగు చేయాలా, వద్ద మీమాంస నెలకొంది. సింగరేణి రెవెన్యూ పరిధి మైదాన ప్రాంతంలో ఉండడంతో ఇక్కడి భూములకు మంచి ధర పలుకుతోంది. అయితే, వ్యవసాయి భూములు, ఇంటి స్థలాలకు మార్కెట్ ధర కంటే మూడు రెట్లు అదనంగా పరిహారంగా నిర్ణయించినట్లు తెలిసింది. ఇక ఇళ్లకు స్వభావం ఆధారంగా ధర నిర్ణయించి గ్రామసభలో తీర్మానం చేస్తారని సమాచారం. ఇదంతా ఎప్పుడు జరుగుతుందో తెలియకున్నా పరిహారం స్పష్టత లేక, పంటల సాగుపై అవగాహన లేక నిర్వాసితులు ఎదురు చూపుల్లో గడుపుతున్నారు.

ఐదు రెట్లు ఇవ్వాలి..



రైల్వే లైన్ కింద భూమి కోల్పోతున్న మాకు పరిహారం చెల్లించాకే భూములు ఇస్తాం. నాకు ఉన్న రెండెకరాల వ్యవసాయ భూమిలో 1.08ఎకరాలు తీసుకుంటామని చెప్పారు. మార్కెట్ ధర కంటే ఐదు రెట్లు అదనంగా ఇస్తే ఇంకో చోట పొలం కొనుక్కోవచ్చు.

– తొరగ రామస్వామి, కారేపల్లి

మా ఇల్లు కోల్పోతున్నాం..



మా ఇల్లు పూర్తిగా సేకరిస్తామని మార్కింగ్ పెట్టారు. ఐదు నెలలు దాటినా పరిహారం చెప్పడం లేదు. ఇంటి ఖరీదుతో పాటు పరిహారం చెల్లించడమేకాక స్థలం మంజూరు చేసి ఇల్లు నిర్మిస్తే బాగుంటుంది. అప్పుడే మాలాంటోళ్లకు న్యాయం జరుగుతుంది.

– కొమ్మూరి లక్ష్మి, కారేపల్లి

జాబితా పంపించాం..



సర్వే అనంతరం స్థానికుల అనుమానాలు నివృత్తి చేసి జాబితాను ఉన్నతాధికారులకు పంపించాం. కలెక్టర్ నుంచి ఆదేశాలు వచ్చాక భూములకు ధర నిర్ణయించి పరిహారం చెల్లించేలా చూస్తాం. ఆతర్వాతే రైల్వే శాఖ భూములు, ఇళ్లను స్వాధీనం చేసుకుంటుంది.

– సంపత్‌కుమార్, తహసీల్దార్

బంగారు భవిష్యత్‌కు బాటలు వేద్దాం


జయరాజును సత్కరిస్తున్న సీఎండీ బలరామ్, అధికారులు

- బొగ్గు ఉత్పత్తి, నాణ్యతపై దృష్టి పెట్టాలి
- సింగరేణి సీఎండీ బలరామ్ దిశా నిర్దేశం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలని సీఎండీ ఎన్.బలరామ్ పిలుపునిచ్చారు. కొత్తగూడెంలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఆయన అన్ని ఏరియాల జీఎంలు, ఉద్యోగులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కంపెనీ విస్తరణ, సమస్యల పరిష్కారంపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలన్నారు. ఓవర్‌బర్డెన్ తొలగింపులో ఉన్న ఇబ్బందులు అధిగమించాలని, నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి, రవాణాపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నూతన గనులు లేకపోతే ఇల్లెందు, మణుగూరు, బెల్లంపల్లి తదితర ఏరియాలకు భవిష్యత్ ఉండదని, కొత్త గనుల కోసం ముమ్మరంగా ప్రయత్నించాలని అన్నారు. అటవీ అనుమతులు సాధనలో జాప్యం జరగకుండా చూడాలన్నారు. శాంతిఖని, అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్ట్‌ల్లో నష్టాల నివారణకు ప్రత్యేక కమిటీ వేస్తామని చెప్పారు. నాణ్యతా ప్రమాణాలు పెంచేందుకు సత్తుపల్లిలో కోల్‌వాషరీ ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో డైరెక్టర్లు సత్యనారాయణరావు, ఎల్.వి. సూర్యనారాయణ, కె.వెంకటేశ్వర్లుతో పాటు అన్ని ఏరియాల జీఎంలు పాల్గొన్నారు.

ప్రజాకవి జయరాజుకు సన్మానం

సింగరేణి మాజీ ఉద్యోగి, ప్రజాకవి గొడిశెల జయరాజును కొత్తగూడెంలో సీఎండీ ఎన్.బలరామ్ ఘనంగా సన్మానించారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఆయనకు రూ.కోటి నగదు బహుమతి ఇస్తూ గుర్తింపునివ్వడం హర్షణీయమని సీఎండీ తెలిపారు. అనంతరం జయరాజు మాట్లాడుతూ సింగరేణి అందించిన సహకారం, ప్రోత్సాహంతోనే తాను కవిగా, ఉద్యమకారుడిగా ఉన్నత స్థాయికి చేరుకోగలిగానని చెప్పారు. కోల్ మూమెంట్ డైరెక్టర్ ఎస్‌డీఎం సుభాని, డైరెక్టర్లు ఎల్.వీ.సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ పనుల్లో కార్మికుడు మృతి

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో మంగళవారం ప్రమాదవశాత్తు ఓ కార్మికుడు మృతి చెందాడు. మార్కెట్ సమీపాన వడ్డెర కాలనీకి చెందిన కొందరు మార్కెట్‌లోని పాత నిర్మాణాల తొలగింపులో భాగంగా నీళ్ల ట్యాంకు కూల్చివేత పనులు చేపట్టారు. ఈక్రమాన ఒక్కసారిగా ట్యాంకు కూలడంతో చిరంజీవి(42)పై శిథిలాలు పడగా తీవ్ర గాయాలయయ్యాయి. దీంతో ఆయన ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి ప్రైవేట్ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉండగా ఖమ్మం త్రీటౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో వీరంగం

నేలకొండపల్లి: ఓ వ్యక్తి మద్యం మత్తులో అర్ధనగ్నంగా తిరుగుతూ వీరంగం సృష్టించాడు. మండల కేంద్రంలోని ఓ వైన్స్ సమీపాన కూసుమంచి–నేలకొండపల్లి రహదారిపై సదరు వ్యక్తి మద్యం మత్తులో హల్‌చల్ చేశాడు. అర్ధనగ్నంగా తిరుగుతూ వాహనాలను అడ్డుకుంటూ గంటన్నర పాటు ప్రయాణికులను ఇబ్బంది పెట్టాడు. దీంతో స్థానికులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు చేరుకుని ఆయనను అదుపులోకి తీసుకున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో వైర్ చోరీ

కామేపల్లి: మండలంలోని పొన్నేకల్ బుగ్గవాగు ఎత్తిపోతల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్ వైర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. రైతులు ఇచ్చిన సమాచారంతో ఇరిగేషన్ డీఈఈ శంకర్‌నాయక్, ఏఈఈ రమేశ్ మంగళవారం పరిశీలించారు. కాగా, విద్యుత్ శాఖ అధికారులు మరమ్మతు చేయించి ట్రాన్స్‌ఫార్మర్‌ను వినియోగంలోకి తీసుకురావాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గింజల నరసింహారెడ్డి, లిఫ్ట్ ఇరిగేషన్ చైర్మన్ వల్లభనేని అప్పారావు కోరారు.

గంజాయి స్వాధీనం

ఖమ్మంక్రైం: ఖమ్మం శుక్రవారిపేటలో ఓ వ్యక్తి వద్ద పోలీసులు మంగళవారం గంజాయి స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారిపేటకు చెందిన మెకానిక్ షేక్ రెహమాన్ కొంతకాలంగా ఇతర ప్రాంతాల నుంచి గంజాయి తీసుకొచ్చి ఇతరులకు విక్రయిస్తున్నాడని తెలిసింది. ఈ విషయమై అందిన సమాచారంతో వన్ టౌన్ పోలీసులు ఆయన ఇంట్లో తనిఖీ చేయగా 530గ్రాముల గంజాయి లభించింది. దీంతో ఆయనను అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

భర్త అన్యాయం చేశాడని మహిళ నిరసన


ఆందోళన చేస్తున్న వాణి, బంధువులు

తల్లాడ: మరో పెళ్లి చేసుకున్న భర్త తనకు అన్యాయం చేశాడంటూ ఓ మహిళ ఆయన ఇంటి ఎదుట నిరసనకు దిగింది. మండలంలోని మల్సూర్‌తండా గ్రామంలో మంగళవారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు... మల్సూర్‌తండాకు చెందిన భూక్యా నాగేశ్వర్‌రావు ఏడేళ్ల క్రితం కొణిజర్ల మండలం రాజ్యతండాకు చెందిన గుగులోత్ వాణిని వివాహం చేసుకున్నాడు. ఆమెకు కుమారుడు జన్మించాక వరకట్నం కోసం వేధిస్తుండడంతో కొణిజర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆపై వాణికి విడాకులు ఇవ్వకుండానే మరో యువతిని పెళ్లి చేసుకున్నాడు. ఈ విషయం తెలిసిన వాణి తమ బంధువులతో కలిసి ఆయన ఇంటికి చేరుకుని నాగేశ్వరరావు, ఆయన రెండో భార్యను గదిలో నిర్బంధించి నిరసనకు దిగింది. ఈమేరకు పోలీసులు చేరుకుని స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు.

ఉన్నత ఆశయంతో ఇందిరా డెయిరీ

సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క


కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అధికారులతో సమీక్షిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

మధిర: మహిళలను ఆర్థికంగా తీర్చిదిద్దాలన్న ఉన్నతాశయంతో ఇందిరా మహిళా డెయిరీ ఏర్పాటుచేస్తున్నామని, అధికారులు సమన్వయంతో దీన్ని విజయవంతం చేయాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. మధిరలోని క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఆయన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, డీఆర్డీఓ సన్యాసయ్యతో పాటు వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. ఇందిరా డెయిరీ ద్వారా లబ్ధిదారులకు రెండేసి గేదెలు అందజేయాలని, ఇందుకోసం సభ్యులు ఎలాంటి నగదు చెల్లించాల్సిన అవసరం లేదనే విషయమై అవగాహన కల్పించాలన్నారు. అలాగే, భూమి లేకున్నా అర్హులేనని.. అసలే గేదెలు లేనివారికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రానున్న ఐదు నెలల్లో లబ్ధిదారులకు గేదెలు అందించేలా కొనుగోలుపై దృష్టి సారించాలని భట్టి సూచించారు.

- ఈనెల 8న నిర్వహిస్తున్న మధిర ప్రభుత్వ జూనియర్ కళాశాల గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలకు హాజరుకావాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కమిటీ సభ్యులు కోరారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయనకు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈకార్యక్రమంలో మిరియాల రమణగుప్తా, మొండితోక సుధాకర్, అద్దంకి విప్లవకుమార్, బెజవాడ రవి, శీలం వెంకటరెడ్డి, మక్కెన నాగేశ్వరరావు, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.
- తొలి తరం తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పుతుంబాక శ్రీకృష్ణప్రసాద్, రమావత్ బాబురావు తదితరులు మాట్లాడారు. 1969 ఉద్యమంలో పాల్గొన్న తాము అనేక సమస్యలతో బాధపడుతున్నందున ప్రభుత్వం తరపున ఆదుకోవాలని విన్నవించారు.
- ఎర్రుపాలెం: ఎర్రుపాలెం మండలంలోని 31 జీపీల్లో తెనుగోళ్లు, మున్నూరు కాపు కులస్తులకు రాజీవ్ యువ వికాసం యూనిట్లు కేటాయించలేదని సంఘం మండల బాధ్యులు నాయకులు సూరంశెట్టి భాస్కరరావు, కడియం శ్రీనివాసరావు, మల్లెల లక్ష్మణరావు తెలిపారు. ఈమేరకు బుధవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కు వినతిపత్రం అందజేసి న్యాయం చేయాలని కోరారు. నాయకులు పసుపులేటి వెంకటనారాయణ, గంధం శ్రీనివాసరావు, తోట సాంబశివరావు, పసుపులేటి మహేష్, శ్రీపాలశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇళ్ల మంజూరు నిరంతర ప్రక్రియ

రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి


ముజ్జుగూడెంలో పశు వైద్యశాలను ప్రారంభించిన మంత్రి శ్రీనివాసరెడ్డి

నేలకొండపల్లి: ఇందిరమ్మ ఇళ్ల మంజూరు నిరంతర ప్రక్రియ అని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. నేలకొండపల్లి మండలం ముజ్జుగూడెం, బైరవునిపల్లి, బోదులబండ, నేలకొండపల్లి, చెన్నారంల్లో మంగళవారం పర్యటించిన ఆయన వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఆయా గ్రామాల్లో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో 20 లక్షల ఇళ్లు నిర్మించాలన్నది లక్ష్యం కాగా, తొలి విడతలో 4.50 లక్షల ఇళ్లు మంజూరు చేశామని తెలిపారు. ప్రతీ నియోజకవర్గంలో 3,500 ఇళ్లు మంజూరు చేయగా, అర్హులందరికీ కేటాయిస్తామని వెల్లడించారు. ఈ విషయంలో ఎవరు కూడా అభద్రతా భావానికి లోనుకావొద్దని సూచించారు. కాగా, బౌద్ధ క్షేత్రం సమీపంలో గుడిసెల్లో ఉంటున్న పలువురు మంత్రి శ్రీనివాసరెడ్డిని కలిసి ఇందిరమ్మ ఇళ్లు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో మార్కెట్ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, నాయకులు శాఖమూరి రమేష్, కొడాలి గోవిందరావు, భద్రయ్య, జెర్రిపోతుల అంజిని, బచ్చలకూరి నాగరాజు, కె.హన్మంతరావు, వంగవీటి నాగేశ్వరరావు, వెంకన్న, జెర్రిపోతుల సత్యనారాయణ, కడియాల నరేష్, వేగినాటి లక్ష్మినర్సయ్య, ఉండమోదుగుల శ్రీనివాస్, తన్నీరు నారాయణ, కొమ్మూరి నరేష్, యడవల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లాలో మంత్రి పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10గంటలకు ఖమ్మం రూరల్ మండలం సత్యనారాయణపురంలో నిర్వహించే సమావేశంలో ఏదులాపురం మున్సిపాలిటీ పరిధి లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేస్తారు. ఆతర్వాత ఖమ్మం 60వ డివిజన్ రామన్నపేట, దారేడు, పోలిశెట్టిగూడెం, తీర్థాలో రహదారుల నిర్మాణానికి శంకుస్థాప చేశారు. అనంతరం మధ్యాహ్నం ఒంటి గంటకు కూసుమంచిలోని క్యాంప్ కార్యాలయంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తారు. అలాగే, సాయంత్రం కూసుమంచి మండలం గట్టు సింగారం, చేగొమ్మ, బచ్చోడు, పాలేరు, నాయకునిగూడెంలో పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేయనున్నారు.

ఉమ్మడి జిల్లాలో గోదావరి పరవళ్లు

లింక్ కెనాల్ పనులు పరిశీలించిన మంత్రి తుమ్మల


లింక్ కెనాల్ వద్ద పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

ఏన్కూరు: గోదావరి జలాలతో ఉమ్మడి జిల్లాను సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా సీతారామ ఎత్తిపోతల పథకం సిద్ధమవుతోందని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఇందులో కీలకమైన రాజీవ్ కెనాల్ పనులు 8.86 కి.మీ.ల్లో 7.86 కి.మీ. మేర పూర్తయినందున, వైరా, మధిర, సత్తుపల్లి, అశ్వారావుపేట నియోజకవర్గాలకు సాగునీరు అందనుందని వెల్లడించారు. ఏన్కూరు సమీపాన రాజీవ్ కెనాల్(ఏన్కూరు లింక్ కెనాల్) పనులను మంగళవారం మంత్రి పరిశీలించి మాట్లాడారు. ఈనెల 10వ తేదీకల్లా కెనాల్ పనులు పూర్తి కానుండగా, పుష్కలంగా సాగునీరు అందుతుందన్నారు. కాగా, సత్తుపల్లి, అశ్వారావుపేట నియోజకవర్గాలకు సాగునీరు అందించేలా యాతాలకుంట టన్నెల్ నిర్మిస్తున్నామన్నారు. సాగర్ ద్వారా కృష్ణా జలాలు రావడానికి రెండు నెలల ముందుగానే ఖమ్మం జిల్లా రైతులకు గోదావరి జలాలు అందించాలన్నది తమ సంకల్పమని మంత్రి తెలిపారు.

ఆటోను వెనుక నుంచి ఢీకొట్టిన లారీ

తీవ్రగాయాలతో నాలుగేళ్ల చిన్నారి మృతి

ఖమ్మంరూరల్: రూరల్ మండలంలోని ఏదులాపురం క్రాస్ వద్ద ఆగి ఉన్న ఆటోను మంగళవారం లారీ ఢీకొట్టిన ఘటనలో కోసూరి బృంద(4) మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... బృంద తండ్రి అప్పారావు కుమార్తెతో కలిసి ఏదులాపురం క్రాస్ వద్ద టీ తాగడానికి వచ్చాడు. అదే సమయాన ఆయన స్నేహితుడు కృష్ణ ఆటో వచ్చింది. దీంతో ముందు సీటులో కృష్ణ ఉండగా, బృందను వెనక సీటులో కూర్చోబెట్టి షాప్‌లో కూల్‌డ్రింక్ తీసుకురావడానికి వెళ్లాడు. అంతలోనే వరంగల్ వైపు నుండి అతివేగంగా వచ్చిన టిప్పర్ లారీ ఆటోను వెనుక నుండి ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన బృంద, కృష్ణను ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బందం మృతి చెందింది. కళ్ల ముందే జరిగిన ప్రమాదంలో కుమార్తె మృతి చెందగా అప్పారావు, కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. ఘటనపై కేసు నమోదు చేసినట్లు సీఐ ముష్క రాజు తెలిపారు.

'గుట్ట'కాయ స్వాహా...

- అక్రమంగా తవ్వకాలు, మొరం తరలింపు
- కన్నెత్తి చూడని అటవీ, రెవెన్యూ అధికారులు


తవ్వకాలు చేపట్టిన ప్రాంతం


మద్దులపల్లి గుట్ట వద్ద ట్రాక్టర్‌లో మొరం నింపుతున్న జేసీబీ

కామేపల్లి: ప్రభుత్వ స్థలమని తెలియగానే వారికి ఒక్కసారిగా ఉత్సాహం వచ్చినట్లుంది.. ఎవరూ పట్టించుకోరనే నమ్మకంతో ధనార్జనే ధ్యేయంగా రాత్రింబవళ్లు యంత్రాలతో గుట్టను తవ్వి మొరాన్ని తరలిస్తున్నారు. పెద్దసంఖ్యలో ట్రాక్టర్లు, టిప్పర్లతో మొరం తరలిస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటుండగా.. దీన్ని అడ్డుకోవాల్సిన యంత్రాంగం నిర్లక్ష్యం వ్యవహరిస్తుండడం విమర్శలకు తావిస్తోంది. కామేపల్లి మండలంలోని మద్దులపల్లి, కెప్టెన్‌బంజర గ్రామ సమీపాన గుట్టల్లో ప్రొక్లెయినర్ల సాయంతో మొరం తవ్వి వాహనాల్లో తరలిస్తున్నారు. అయితే, ప్రభుత్వ భూములు, గుట్టల సంరక్షణపై దృష్టి సారించాల్సిన అధికారులు అధికారులు ఉదాసీనంగా ఉండడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇష్టారీతిగా తవ్వకాలు

అక్రమంగానే కాక ఇష్టారాజ్యంగా గుట్టలపై, చుట్టూ తవ్విస్తున్న కొందరు మొరం తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. పట్టణాల్లో ఇళ్ల నిర్మాణాలు, వెంచర్ల ఏర్పాటుకు మొరం అవసరమవుతోంది. దీంతో ఇక్కడ ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపడుతూ మొరం తరలించి జేబులు నింపుకుంటున్నారు. అయినా అటవీ శాఖ, రెవెన్యూ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. గుట్టల వద్ద మొరం తవ్వకాలతో ఆ ప్రాంతం స్వరూపాన్ని కోల్పోతుండగా చెట్లు కనుమరుగవుతున్నాయి.

సెలవు రోజుల్లో మరింతగా..

మామూలు రోజుల్లోనే ఇక్కడ తవ్వకాలను అధికారులు పట్టించుకోవడం లేదు. ఇక సెలవు రోజుల్లోనైతే ఇటు వైపు ఎవరూ రారన్న నమ్మకంతో అక్రమార్కులు ఆయా రోజుల్లో మరిన్ని వాహనాలను రంగంలోకి దింపుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. అలాగే, రాత్రివేళ కూడా తవ్వకాలు చేపట్టి మొరం తరలిస్తుండడంతో వాహనాల రాకపోకలతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు వాపోతుతున్నారు. ఒకవేళ స్థానికులెవరైనా ఫిర్యాదు చేసినా అధికారులు వచ్చేలోగా వాహనాలతో సహా మాయమవుతున్నారని సమాచారం. ఇప్పటికైనా అధికారులు నిఘా వేయకపోగా గుట్టలు పూర్తిగా కనుమరుగవుతాయని స్థానికుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇకనైనా చెక్ పెట్టాలి..



మద్దులపల్లి, కెప్టెన్‌బంజర సమీపాన గుట్టలపై మొరం, మట్టిని జేసీబీ, ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండానే తవ్వకాలు చేపడుతుండడం అనుమానాలకు తావిస్తోంది. అధికారులు ఇకనైనా అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి.– జాలె శ్రీనుయాదవ్, మద్దులపల్లి

తవ్వకాలు చేపడితే చర్యలు



గుట్టలపై మొరం తవ్వకాలు చేపడితే చర్యలు తప్పవు. ప్రభుత్వ భూములు, గుట్టలపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. సెలవు దినాల్లోనూ నిఘా ఏర్పాటుచేస్తాం. ఎవరు నిబంధనలను అతిక్రమించినా చట్టపరమైన చర్యలతో పాటు కేసులు నమోదు చేస్తాం.

– సుధాకర్, తహసీల్దార్, కామేపల్లి